
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 113 | గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# చంద్రబాబు అరాచక పాలన



### ఇదేమి రాజ్యం.. బాధితులే నిందితులు.. శాశ్వతంగా మీరు అధికారంలో ఉండరు మూల్యం చెల్లించుకుంటారు

### జైలు లోపల నన్ను అవమానించారు.. వెన్నుపోటు పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు

### ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్ట్ అధికార దుర్వినియోగానికి నిదర్శనం

### కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో వైయస్ జగన్ ములాఖత్

**(అంకుశం, కర్నూలు, ఆగస్టు 13):**
రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు వ్యవస్థ సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుది అని నిత్యం వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారనిరాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బాధితులనే నిందితులుగా మార్చడం, దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడం, బాధితులకు అండగా నిలిచిన వారిని అరెస్ట్ చేయడం రాష్ట్రంలో పరిపాటిగా మారిందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి వందలాది మంది పోలీసులతో దాడి చేసి, - మిగతా 2లో






## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత




### కుంకీ ఏనుగుల రాకతో ఏపీలో అద్భుత ఫలితాలు

### రాష్ట్రంలో ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు

### అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**(అంకుశం, విశాఖపట్నం, ఆగస్టు 13):**
'ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు -- వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. - మిగతా 2లో

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

### -- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

### -- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

### -- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 13):**
సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ -- మంగళగిరి -- గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ--3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం-- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ - మిగతా 2లో






## ఆర్డీటీ క్రీడా మైదానం గ్రామీణ క్రీడాకారుల వరం



### బాలికలతో కలసి కబడ్డీ ఆడిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే

### ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించడమే ఆర్డిటి లక్ష్యం

### ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెర్రర్

### జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్

**అంకుశం ప్రతినిధి మడకశిర,ఆగస్టు,13:**
అనంతపురం జిల్లాలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి పనిచేస్తున్నదని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని అందుకోసం ఆర్డిటి సంస్థశక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెర్రర్ అన్నారు మడకశిర మండలం, ఆర్. అనంతపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌డీటీ స్పోర్ట్స్ స్టేడియంను గురువారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మరియు ఆర్‌డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ లతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. మడకశిర మండలం, ఆర్. అనంతపురం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ఆర్‌డీటీ స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. మైదాన ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ విద్యార్థినులు, గ్రామీణ బాలికలతో కలిసి ఉత్సాహంగా కబడ్డీ ఆడారు.కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో పాటు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మరియు ఆర్‌డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ దిగి క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. స్వయంగా కలెక్టర్, ఎమ్మెల్యే బాలికలతో కలిసి కబడ్డీ ఆడటంతో - మిగతా 2లో



# చంద్రబాబు అరాచక పాలన



-మొదటిపేజీ తరువాయి
తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేయడం ఇందుకు పరాకాష్ట అని పేర్కొన్నారు. కర్నూలు జైల్లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో ములాఖత్ అనంతరం వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 1న చిప్పగిరి మండలంలోని సంగాల గ్రామంలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్త గిరిపై, ఆయన ఇంటిపై దాడి జరిగింది. సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మెల్యేకు గిరి రాత్రి 7.45 గంటలకు ఫోన్ చేసి, తనపై దాడి జరుగుతోందని, తన ఇంటి ఫొటోలు, వీడియోలు కూడా పంపించి రక్షించాలని కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 7.47 గంటలకు చిప్పగిరి ఎస్ఐకి ఫోన్ చేసి సంఘాల వెళ్లి గిరిని కాపాడాలని కోరారు. అనంతరం సీఐకి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఉదయం 8.03 గంటలకు మరోసారి సీఐకి సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లలేదని తెలిపారు. పోలీసులు స్పందించకపోవడంతో గిరిని కాపాడేందుకు ఎమ్మెల్యే స్వయంగా సంఘాల గ్రామానికి వెళ్లారు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గిరిని తన కారులో ఎక్కించుకుని చిప్పగిరికి తీసుకువస్తుండగా నేమకల్లు వద్ద ఎమ్మెల్యేపైనే దాడి జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు గాయపడి చేయి విరిగిందని పేర్కొన్నారు. బాధిత కార్యకర్తను కాపాడేందుకు వెళ్లడాన్నే ఎమ్మెల్యేపై పెట్టిన మొదటి కేసుగా మార్చారని అన్నారు. నేమకల్లు ఘటనను కప్పిపుచ్చేందుకు టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చింపి, ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు చింపారంటూ ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని వైయస్ఆర్‌సీపీ నాయకుడు ఆరోపించారు. ఇది ఎమ్మెల్యేపై పెట్టిన రెండో కేసు అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కారును ధ్వంసం చేశారంటూ మూడో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాములు, దాడికి గురైన గిరిని తీసుకుని ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయాలని కోరినా పోలీసులు కనీసం ఫిర్యాదును కూడా తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి వెళ్లినా బాధితుల ఫిర్యాదు స్వీకరించకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది నాలుగో తప్పిదమని పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకోకపోవడమే కాకుండా బాధితులైన విరూపాక్ష, ఆయన కుటుంబ సభ్యులు, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపైనే రివర్స్ కేసులు పెట్టారని తెలిపారు. సంఘాల ఘటనకు సంబంధించిన ఫిర్యాదులోనే పలువురి పేర్లు వేర్వేరు నిందితుల జాబితాల్లో మళ్లీ మళ్లీ పునరావతం కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విచారణ లేకుండానే కేసుల్లో పేర్లు చేర్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇది ఐదో తప్పిదమని తెలిపారు. విరూపాక్షను పరామర్శించేందుకు తాను జైలుకు వెళ్లినప్పుడు తనను అవమానించేలా వ్యవహరించారని తెలిపారు. సాధారణంగా జైలుకు వచ్చే వారిని కూర్చోబెట్టి ఫొటోలు తీస్తారని, తనను మాత్రం గ్రిల్ బయట నిలబెట్టి ఫొటోలు తీశారని పేర్కొన్నారు. దీనిపై జైలు అధికారులను ప్రశ్నించగా, తనకు ప్రత్యేకంగా అలా చేయాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారని తెలిపారు.

# స్వయం సహాయక సంఘాలకు గుడ్ న్యూస్

-- 10 మంది నిబంధన సడలింపు
-- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి
-- బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు



**(అంకుశం, అమరావతి, ఆగస్టు 13 :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు.

## నిరసనలు, నినాదాలతో సభ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు'

నిరసనలు చేపట్టడం, నినాదాలు చేయడం ద్వారా లోక్‌సభ ప్రతిష్ఠను దెబ్బతీయడం సమంజసం కాదని లోక్?సభ స్పీకర్ ఓం బిర్లా హితవు పలికారు. ప్రజల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ వేదికగా ఉందని, సభ్యులు తమ అభిప్రాయాలను సభలో వ్యక్తం చేయాలని సూచించారు. ప్రతిపక్షం, అధికారపక్షం ఆలోచనలు, విధానాలు వేర్వేరుగా ఉండొచ్చని, కానీ దేశ ప్రజలు మాత్రం పార్లమెంట్ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నారని అన్నారు. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా వారిని ఉద్దేశించి మాట్లాడారు. సభను పనిచేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సమావేశాలు ప్రారంభమైన తర్వాత స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. దీంతో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. దీంతో బుధవారం ప్రశ్నోత్తరాల సమయం మూడు నిమిషాలకంటే తక్కువ వ్యవధికే పరిమితమైంది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై ప్రశ్నించి సమాధానాలు పొందాల్సి ఉండగా, నిరసనల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రోజూ ఏదొక అంశంపై ప్రతిపక్షం, ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ప్రశ్నోత్తరాల సమయం పూర్తిస్థాయిలో కొనసాగలేదు. ఇలా జరగడం ఇది 18వ రోజు.

## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని దిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిశీలించారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై 20వేల పేజీలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టం, 2024 కింద నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. 360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. అయితే, ఈ కేసులో సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టులో ఇంకా చెప్పనివి, ప్రస్తుతం ఛార్జిషీటులో భాగంగా ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమని కోర్టు పేర్కొంది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచించింది.

### పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఇదిలా ఉండగా, పేపర్ లీక్ వ్యవహారంపై ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టడానికి, అలాగే లీకేజీ బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా చూసేందుకు ఈ ఫాస్ట్?ట్రాక్? కోర్టులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణలో జాప్యం జరగకుండా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, 2 నుంచి 3 నెలల లోపే కేసుకు సంబంధించిన తీర్పులు ఇచ్చేలా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'కు కూడా ఇటీవల లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త సవరణలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఈ కేసులో దోషులుగా నిర్ధరణ అయితే, గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, రూ.10కోట్ల వరకు భారీ జరిమానా విధిస్తారు.

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఇక, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లాగే, ప్రత్యేక టాస్క్? ఫోర్స్?ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కేంద్ర ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటించారు. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక టాస్క్?ఫోర్స్? కోసం ఏర్పాటు చేసిన కమిటీ, ప్రధానంగా పరీక్షల సంస్కరణలపై దృష్టి సారిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీలో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

## త్వరలోనే జంతర్ మంతర్ సీజన్- 2 ప్రారంభం

### సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే

విద్యార్థుల నిరసన తరహాలోనే మరో నిరసన కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆయన 'జంతర్ మంతర్ సీజన్- 2'గా అభివర్ణించారు. దిల్లీలో తమ వాలంటీర్ల సమావేశం కోసం వేదికను వెతకడంలో సీజేపీ ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెప్పి తమకు వేదికను ఇచ్చేందుకు నిరాకరించారని ఆరోపించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ హస్తం ఉందని విమర్శించారు. ఇటువంటి చర్యలు సీజేపీని ఏమాత్రం భయపెట్టలేవని స్పష్టం చేశారు. దిల్లీలో జరిగిన బహిరంగ సమావేశంలో ఈ మేరకు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. "'జంతర్ మంతర్ సీజన్- 2' ఎప్పుడు మొదలవుతుందని చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుతున్నారు. వారికి నేను చెప్పేది ఒక్కటే- 'జంతర్ మంతర్ సీజన్- 2' చాలా త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఈ రోజు దిల్లీలో మా వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్నాం. దాని కోసం హాల్ వెతికినా ఎవరూ అద్దెకు ఇవ్వలేదు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారు. చివరికి ఒక హాల్ దొరికింది. అయితే ఆ యజమానికి ఈ రోజు ఉదయం బెదిరింపులు వచ్చాయి. సీజేపీ సమావేశాన్ని ఇక్కడ జరగనిస్తే వారిని (హాల్ యజమానులను) తలకిందులుగా వేలాడదీస్తామని బెదిరించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ ఉంది. ఇదంతా బీజేపీయే చేస్తోంది. దేశంలోని యువతను చూసి కమలం పార్టీ భయపడుతోంది. ఆ పార్టీ నేతల మాటలు, చేతలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి చర్యలతో మమ్మల్ని భయపెట్టవచ్చని వారు అనుకుంటే అది పొరపాటే. ఇటువంటి చర్యలకు మేం అస్సలు భయపడం. "

### బీజేపీపై ఫైర్

కమలం పార్టీపై దిల్లీ వేదికగా సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి ఘాటు విమర్శలు చేశారు. తాము పాఠశాలల బాగు గురించి మాట్లాడుతున్నందున గందరగోళం సృష్టించడానికి బయటి వ్యక్తులను ఇక్కడికి పంపారని ఆరోపించారు. బీజేపీకి విద్య విషయంలోనే సమస్య ఉందని మండిపడ్డారు. అసలు సీజేపీ సమావేశం వద్ద గందరగోళం సృష్టించడానికి వచ్చిన వ్యక్తి ఎవరో తమకు తెలియదన్నారు.

## జాతర్ మండి మొదటి వార్షికోత్సవం వేడుకల్లో పాల్గొన్న దారపనేని




**కనిగిరి ఆగస్టు 13 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామస్తులు విజయవాడ మొగల్రాజపురం లో నిర్వహిస్తున్న జాతర మండి బిరియాని రెస్టారెంట్ కస్టమర్ దేవుళ్ళ సహాయ సహకారాలతో గురువారం దిగ్విజయంగా మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని కేక్ కట్ చేసి రెస్టారెంట్ నిర్వహకుల కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందించాలని, కోరారు. రెస్టారెంట్ నిర్వాహకులు దారపనేని ని దృశ్యాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెద మాల కొండయ్య, చిన్న మాల కొండయ్య (బొజ్జయ్య) మాధవరావు, మానం కొండల్ రావు, మానం మల్లికార్జునరావు, మానం కిరణ్, మిత్రులు శ్రేయోభిలాషులు, కస్టమర్లు పాల్గొన్నారు.

## ఆర్‌డీటీ క్రీడా మైదానం గ్రామీణ క్రీడాకారుల వరం

-మొదటిపేజీ తరువాయి
మైదానంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. క్రీడలు యువతలో క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని, ఈ స్టేడియం ద్వారా స్థానిక క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు చక్కటి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని, యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడారంగ అభివృద్ధికి ఆర్‌డీటీ సంస్థ అందిస్తున్న సహకారం మరచిపోలేనిదని, ఈ ప్రాంత అభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఆర్‌డీటీ ప్రతినిధి మంచో ఫెర్రర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ, వసతులు కల్పించడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్‌డీటీ సిబ్బంది, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

-మొదటిపేజీ తరువాయి
నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... 'రాష్ట్రాభివద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019--24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. 'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. '2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. 'అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి
వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మానవులు -- వన్య ప్రాణుల మధ్య నెలకొన్న ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి, రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ గౌరవ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు కల్పన- ఎమ్మెల్యే నల్లమిల్లి

**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు:** మాతా శిశు మరణాలను అరికట్టడంతో పాటు పేద ప్రజల ఆరోగ్య రక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెదపూడి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో “తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్” వాహనాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ప్రసవానికి ముందు తర్వాత ఏ తల్లి,బిడ్డ ఎటువంటి ఇబ్బందులు పడకూడదని సదుద్దేశంతో అధునాతన వాహనాలను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి,జనసేన నేత రావాడ నాగు, టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు సత్తి దేవదాన రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి, కూటమి నేతలు,వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పుస్తకాలు మోయించిన ఉపాధ్యాయుడు

కిలోమీటర్ పైగా విద్యార్థులచే పుస్తకాలు మోయించిన ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయుడు తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



**అంకుశం న్యూస్ మడకశిర ఆగస్టు.13** శ్రీ సత్య సాయి జిల్లా : రొళ్ల మండలం ఆర్.గొల్లహట్టి గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడు నరసింహ నాయక్ దాష్టికం అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఆర్.గొల్లహట్టి పాఠశాల వరకు కిలోమీటర్‌కు పైగా దూరం విద్యార్థులతో పుస్తకాలు మోయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల చేత పుస్తకాలు మోయిస్తున్న దృశ్యాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చదువుకోవాల్సిన విద్యార్థులతో కూలీల మాదిరిగా పుస్తకాలు మోయించడం ఏమిటంటూ తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల చేత పుస్తకాలు మోయించిన ఘటనపై విద్యాశాఖ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## అమరావతి ఛాంపియన్ షిప్ -2026 లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్( బాయ్స్) కదిరి విద్యార్థులు.



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్ట్:13:** హిందూపురంలోని బసవన్న పల్లి పాఠశాలలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్ షిప్ -2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ (బాయ్స్ ) కదిరి విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. వివిధ క్రీడా విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు కె భార్గవ్ నాయక్ (వాలీబాల్) బి.మహేంద్ర నాయక్ (వాలీబాల్) ఈ.హర్ష హరినాయక్ (వాలీబాల్) బి.తరుణ్ నాయక్ (ఖో ఖో ),ఏటిపి ఆర్డిటి డిస్టిక్ మీట్ సెలక్షన్ వివిధ క్రీడ విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు బి.జయ సాగర్ నాయక్ (లాంగ్ జంప్-అథ్లెటిక్స్)బి.గోవర్ధన్ నాయక్ 400 మీటర్స్ (అథ్లెటిక్స్) ఎం.ప్రశాంత్ నాయక్ షాట్ పుట్ -(అథ్లెటిక్స్ ) ఈ.హర్ష హరి నాయక్ 600 మీటర్స్ అథ్లెటిక్స్,పి శివకుమార్ నాయక్ హై జంప్ అథ్లెటిక్స్. ఈ సందర్భంగా ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ బాయ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉపేంద్ర, ఉపాధ్యాయులు విద్యార్థులు అందరినీ అభినందించడం జరిగింది. రాష్ట్రస్థాయిలో కూడా పథకాలు సాధించి ఏపీ టి డబ్ల్యూ ఎస్ బాయ్స్ పాఠశాలకు,శ్రీ సత్య సత్యసాయి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను మరింత ప్రోత్సహించిన స్కూల్ ప్రిన్సిపల్ డా. బి.ఉపేంద్ర

## పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలి.

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత సమీక్ష సమావేశం




**అంకుశం న్యూస్ పెనుకొండ ఆగస్టు 13** శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గంలోని మంత్రి సవితమ్మ పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల ముఖ్య నాయకులు, మండల అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, త్వరలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చని మంత్రి సవిత పేర్కొన్నారు.

## ఎన్ పి.కుంట మండలంలో పర్యటించిన కదిరి వైస్సార్సీపీ సమన్వయ కర్త బియస్.మక్బూల్ మహమ్మద్



**అంకుశం న్యూస్,ఎన్.పి కుంట,ఆగస్టు:13:** ఎన్.పి.కుంట మండలంలో జవుకల. టిఎన్.పల్లి, రైతుల పై పెట్టిన అక్రమ కేసులను,ఎత్తి వేసి సోలార్ భాదిత రైతులకు న్యాయం చేయాలనీ,లేని పక్షంలో రైతుల కోసం ఎందాకైనా వెళ్తాం అని,రైతుల భూములు రైతులకు చెందాలని,దీనికి కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెప్పకుండా రైతులకు న్యాయం చేయాలనీ వైస్సార్సీపీ తరపున డిమాండ్ చేస్తున్నామని,కదిరి వైస్సార్సీపీ సమన్వయ కర్త బియస్. మక్బుల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీ శివారులో కోటి రూపాయిలతో అభివృద్ధి పనులకు భూమి పూజ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అంకుశం న్యూస్,అనంతపురం,ఆగస్ట్:13:** టీడీపీ నాయకులు,అధికారులతో కలిసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దగ్గుపాటి. గత ఐదేళ్ల గొడ్డలిపార్టీ పాలనలో నగరంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదు. ఈరోజు 15ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్డు వేస్తున్నాం,20-25ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామని,కేవలం రోడ్లు,డ్రైనేజీలు వంటి మౌళిక వసతులకే 200కోట్లు ఖర్చు చేశాం. శ్రీనగర్ కాలనీ 2వ జూబ్లీహిల్స్ గా మారింది. వైసీపీ హయాంలో పెట్టి పోయిన డంపింగ్ యార్డ్ లో చెత్తను తొలగిస్తున్నామని,మరో మూడు నెలల్లో పూర్తి స్థాయిలో చెత్తను తొలగిస్తాం,ఇక్కడ పార్కుతో పాటు ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తాం,ప్రజలు కూడా అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్నారనీ,స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమే మిమ్మల్ని గెలిపిస్తామని ప్రజలు చెబుతున్నారనీ ఎమ్మెల్యే దగ్గుపాటి ఈ సందర్భంగా తెలియజేశారు.

## రైతుల ప్రయోజనాల కోసం ‘కర్షక’ యాప్ -- ఆధునిక సాంకేతికతతో వ్యవసాయానికి కొత్త దిశ



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:13:** కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న వాయిస్ ఆఫ్ సిటిజన్ కార్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( ఏఐ ) సాంకేతికతను వినియోగిస్తూ రైతుల ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురానున్న ‘కర్షక’ యాప్‌పై కదిరి నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ‘కర్షక’ యాప్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం,పంటలకు వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించడం,పంట నష్టాలను నివారించేందుకు అవసరమైన సూచనలు అందించడం,పంట దిగుబడిని పెంచే విధంగా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు,వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా... ఆధునిక సాంకేతికతతో కదిరి రైతాంగానికి మరింత అండగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు.

## హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, నివాసంలో మువ్వన్నెల జెండాను సగర్వంగా ఎగరవేశారు....



**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 13** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ గారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ , వారి నివాసంలో మువ్వన్నెల జెండాను సగర్వంగా ఎగరవేశారు. ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి నింపేలా, ‘మై నేషన్-నేషన్ ఫస్ట్’ అనే భావన ప్రతి ఇంటికీ చేరే లక్ష్యంతో, 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేస్తూ.. వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమంలో భాగస్వామ్యం అవడం సంతోషంగా ఉందన్నారు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.

## అనంతలోఆగస్టు 30న “చేయూత” ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ

జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్




**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి ఆగస్టు 13:** రాయలసీమలోని ఆరు జిల్లాల విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రచార కరపత్ర ఆవిష్కరణ. మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ (పని చేయగలిగే కృత్రిమ చేతులు) అందించేందుకు రోటరీ క్లబ్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 30న అనంతపురంలో “చేయూత” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లో ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్వావలంబన సాధించాలని కోరారు. లబ్ధిదారులు ముందస్తుగా 8866306969 కాల్ సెంటర్ నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై అధికారులు విస్తృత ప్రచారం కల్పించి, అర్హులకు సమాచారం చేరవేసేలా సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్ జి.ఎం. సురేష్, కార్యదర్శి జి.బి. విశ్వనాథ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చక్రవర్తి, పి. మల్లికార్జున, టి. సంజీవ్ లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో ‘ఇంగ్లీష్’ వెలుగులు: ‘జ్ఞాన జ్యోతి’తో చిన్నారుల భవిష్యత్తుకు పునాది!

**-ముగిసిన 3వ రోజు ‘జ్ఞాన జ్యోతి’ ట్రైనింగ్!**




**రాప్తాడు అంకుశం న్యూస్ ఆగస్టు 13** పిల్లలకు చిన్ననాటి నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా అంగన్వాడీ స్థాయి నుంచే ఇంగ్లీష్ బోధన అందించాలని సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఎంఈఓ పిలుపునిచ్చారు. మండల పరిధిలో కొనసాగుతున్న “జ్ఞాన జ్యోతి 120” మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారంతో విజయవంతంగా పూర్తయింది. ?ఈ సందర్భంగా అధికారుల ఆదేశాల మేరకు 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఆంగ్ల భాషను సులభంగా నేర్పించేందుకు అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక మెళకువలు ఉపాధ్యాయులు, అధికారులు నేర్పించారు. రోజువారీ సంభాషణలో ఉపయోగించే చిన్న చిన్న పదాలు, గ్రీటింగ్స్, కమాండ్స్, ఎక్స్ ప్రెషన్స్ తో పాటు సరదా ఇంగ్లీష్ రైమ్స్ (పాటలు), చిన్న కథలను ఆంగ్లంలో ఎలా నేర్పించాలో సమగ్రంగా వివరించారు. అంతేకాకుండా అంగన్వాడీ వర్కర్లచే బోధనా చార్టులను రాయించి, క్లాస్ రూమ్ లో బోధించే విధానంపై డెమో (ప్రదర్శన) నిర్వహించారు. ఈ శిక్షణతో అంగన్వాడీ టీచర్లలో మరింత నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ ‘జ్ఞాన జ్యోతి’ శిక్షణా కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు లీలావతి, శ్రీవాణి, విద్యాశాఖ డీఆర్పీలు వెంకట నాయుడు, సూర్యనారాయణ, రామ్మూర్తిలతో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఎయిడ్స్,టీబి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం

**సిడిపిఓ శ్రీదేవి, రైడ్స్ పియు 2 కళ్యాణదుర్గం ప్రాజెక్టు మేనేజర్.మహేష్**



**అంకుశం న్యూస్ ఉరవకొండ ఆగస్టు 13 :** ఎయిడ్స్ టీబి సమాజ నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉరవకొండ ప్రాజెక్టు సిడిపిఓ శ్రీదేవి,రైట్స్ పియు 2 కళ్యాణదుర్గం ప్రాజెక్టు మేనేజర్ మహేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ,రీడ్స్ కళ్యాణదుర్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండలోని అంగన్వాడీ ట్రైనింగ్ సెంటర్ నందు ఐఈసి క్యాంపియన్ హెచ్.ఐ.వి/ఎయిడ్స్,టీబీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగముగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది,ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత,చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి,హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు సలహాలు ఇచ్చారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఏ ఆర్ టి మందులు, ఏపీ ఎస్ ఏ సి ఎస్ యాప్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలిపారు. చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు గురించి నేటి యువత తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ,రాజేశ్వరి,ఏ. న్.యం వరలక్ష్మి,రీడ్స్ సిబ్బంది షకీలా,రేణుక,అనిత తదితరులు పాల్గొన్నారు

